# రాజీనామా

"విహారి"

శాస్త్రిగారి పెద్దలకాలంలో వారికి ఆస్తిపాస్తులు బాగా వుండేవి. ఘరానాకు తగినట్లు విధిగా చెయ్యాలసిన శుభాశుభ కార్యాలతో రానురాను అంతా పరులపాలైపోయింది, ఆవిషయాన్నిగురించే ఆవూరిపెద్దలు యిప్పటికీ అంటుంటారు "పురుషార్థులంటే ఆయింటివాళ్ళే! నూరురానీ—నూరుపోనీ కార్యకరాలు చెయ్యడంలో, బ్రాహ్మలకు మృష్టాన్నం వెయ్యడంలో 'నభూతో నభవిష్యతి' అనిపించుకున్నారు. వెధవ ఆస్తి యీపేరు ప్రతిష్ఠలముందు యేపాటి. అసలు మనుష్యజీవనమే వోక్తి బుద్బుదప్రాయం. అలాంటప్పుడు ఆస్తీ గీస్తీ మాట యేముంది?" అంటూ.

శాస్త్రి కాస్త పెద్దవాడై జుట్టు యెగ్గట్టేసరికి మిగిలింది వోరొండు యెకరాల కుష్కి. అదీ కూడా తొండలు గుడ్లుపెట్టేరకం, దాంతో తానూ, భార్యాపిల్లలూ యెలా జీవించడం? రొండెకరాల కని సేద్యం సాగించడం అవివేకంలో మొదటి రకం. పోనీ గుత్తకో, కోరుకో తగలెడదామంటే రొండుయెకరాలకూ కలిసి, పదిరాళ్ళయినారావు. యిహ యీ సరంజామాతో జీవించడంయెలా? యీప్రాబ్లంతో శాస్త్రి నిజంగా కుంగిపొయ్యాడు. వుద్యోగప్రయత్నం చెయ్యడం తప్ప వేరేమార్గం యేదీ కనపళ్ళా. పితృదేవత జీవించివుండే రోజుల్లోనే శిరోమణి ముగించాడు కాబట్టి కాగితంపేలిక జేబులో యిరికించుకొని బయలుదేరాడు. చాలామంది ప్రజాప్రతినిధుల్ని, అంతకు మిగిలిన ఘనుల్ని నమస్కారపూర్వకంగా దర్శించుకున్నాడు. వుద్యోగగడియ కలిసిరాకనో, లేక సమ్మతశాస్త్రీయంగా లేకపోవడంవలనో యెక్కడికెళ్ళినా చుక్కెదురౌతూవొచ్చింది, కొందరు "చూస్తాం"మన్నారు. మరికొందరు "పంపిస్తా"మన్నారు, యింక కొందరు పెదిమెవిరిచి, మౌనముద్రవహించారు. అంతకంటె ఘనులు అసలు దర్శనానిగ్గూడా అవకాశం యివ్వలా. వో పొడుగుపాటి సూటు తప్ప, లోపలగానీ, బైటగానీ యేవిధమైన ఆడంబరమూలేని వో సజ్జనప్రవరుడుమాత్రం 'స్వామీ పనికి మీయోగ్యత పనికిరాదు, చట్టం ప్రకారం పరీక్షయిచ్చినవారే తగినవారుగా యెన్నుకోబడతారు' అని శెలవిచ్చాడు తలపాగ సర్దుకుంటూ.

శాస్త్రి వొక్కసారి వెనక్కితిరిగి చూచుకున్నాడు. యింతమాత్రం సువార్తను వినిపించినందుకు ఆమహానుభావునికి పునఃపునఃకృతజ్ఞత తెలుపుతూ యింటిమార్గంపట్టాడు. మిత్రులతో ఆలోచించి, వేరేమార్గం లేకపోవడంవల్ల వున్న కాస్తా తెగబరికి, శాస్త్రీయమైన పరీక్షకోసం నడుంకట్టాడు. వీరి తాతలకాలంనుంచి వీరిగృహమే తమగృహంగా, వీరిసంపదలే తమసంపదలుగా తలచి, అవకాశం దొరికినపుడంతా అనుభవిస్తూ వొరూన బంధుమిత్రులు యీ సమయంలో తెగబడి సహాయం వోపినంత చెయ్యాలని, ప్రప్రథమంలో ఆలోచించారు. కాని సహాయం లభించే కొద్ది మానవుడు బలహీనుడౌతాడు. వాడికి స్వశక్తుల్ని విజృంభింపజేసి ముందుకు నడవడానికి అవకాశం వుండకపోవడంవల్ల పతితుడూ, పనికిమాలినవాడూ, సోమరీ అయిపోతాడు. యీ సదుద్దేశ్యం వారి మనస్సుల్లో తటుక్కున మెరవడంవల్ల యెవరికి వారు కిక్కురు మనకుండా సర్దుకున్నారు.

సంవత్సరం తిరిగేసరికి శాస్త్రి తలపెట్టిన పనిని వొక్కసారిగా పూర్తిచేసుకున్నాడు. తిరిగి వెనకటికి మల్లే బయలుదేరాడు, అదృష్టాన్ని పరీక్షించుకోడానికి, యీలోగా లోకంలో ఎన్నో మార్పులు జరిగాయి. జాతిద్వేషాలూ, కులతత్వాలూ బాలురకు ప్రథమ శిక్షగా ప్రబలిపొయ్యాయి. యెక్కడికెళ్ళినా "వాకిటి కావలి తిమ్మడి" వరకే యీతగానికి పురోగమనం సాగుతూ వొచ్చింది. యెన్నో వుపవాసాలూ, వుపిళ్లూ జరిగాయి. కాని అదృష్టానికి మాత్రం ఆవంతైనా కరుణకలగలా. నిరాశ కలిగేకొద్దీ పట్టుదల యెక్కువౌతూ వొచ్చింది శాస్త్రికి. చివరికి యేదేవుని దయవల్లనో స్వగ్రామానికి వో పదహారుమైళ్ళదూరంలో వుండే టౌనులో వుద్యోగం లభించింది, విశ్వప్రయత్నంమీద.

శాస్త్రి సంతోషానికి మేరేలేదు. పిల్లలూ తానూ యింక అన్నంకోసం అలమటించాలసిన కష్టం తప్పిందని. యితని పురోవృద్ధిని నిరంతరమూ కోరుతూ, మానసికంగా సహాయం చేస్తూన్న బంధువులు వగైరా వూరివారు వచ్చి, తమ వెల్లివిరిగిపోతూన్న ఆనందాన్ని యిముడ్చుకోలేక, కష్టంతో కంగ్రాచులేషన్సు చెప్పారు. ఆమర్నాడే సకుటుంబంగా ప్రయాణ మయ్యాడు శాస్త్రి టౌనుకి.

శాస్త్రిది చాలా సౌమ్య ప్రకృతి. భావాలు స్వతంత్రమైనవి. వొకరికింద వొంగి దాసోహమంటూ నౌకరీ చెయ్యడం అతని స్వభావానికి వ్యతిరేకమే. కాని కాళ్ళకోసం యిలా చెప్పులు వొళ్ళో పెట్టవాలసి వొచ్చిందని చాలామంది సహృదయులు అనుకున్నారు. అతని సంతోషమంతా యీ మహాచక్రవర్తిత్వం అబ్బిందని కాదు. పిల్లా--బీరకాయ ఆష్టే కడుపు కట్టుకోవలసిన పని తప్పిందిగదా—ని.

సువాసన యెంతదాచినా దాగదు. మొదట్నుంచీ తరతరాలుగా శాస్త్రిది స్వపరభేదం అనేదిలేకుండా వున్న యింటి తనం. తెలిసినవాళ్ళు దాన్నే ముత్తసరిగా "అద్దో యోగం!" అంటుంటారు. యిదంతా యిలా వుండగా వున్న టౌను ఆ ప్రాంతానికంతా అన్ని విషయాల్లోకీ కేంద్రంగావుంది. న్యాయాలయమూ. రిజిస్ట్రారు ఆఫీసూ, పోలీసుస్టేషనూ. కాస్త హైస్కూలూ అదీ వుంది. యీకాలంలో పీటికుండే ఆకర్షణ మరోదానికి లేదాయె. యిన్ని కారణాలవల్లనూ, యివిగాక యితరస్వీయకారణాలవల్లనూ శాస్త్రిగారి బంధువులూ, చుట్టాలూ, తరచుగా టౌనుకి రావడం—వెళ్ళడం సహజంగా జరుగుతూ వొచ్చింది. వెధవ పూటకూలి కొంపల్లో తిని తిని వాళ్ళ ఆచార వ్యవహారాలుకూడా గంగలో కలిసిపోతూవొచ్చాయి. కాని టౌన్‌లో శాస్త్రి చేరిన తర్వాత ఆ యిబ్బందులన్నీ తొలిగిపొయ్యాయి. వ్యవహారాలకీ, సాక్ష్యాలకీ వొచ్చినవారు వారంరోజులు కానీ, పదిరోజులు కానీ శాస్త్రిగారింట్లోనే దేవతార్చన. కాస్త కలవాళ్ళు తమపిల్లల్ని హైస్కూల్లోచేర్చి, కుదిరినమట్టుకి వారాలు యేర్పాటుచేసి లాడ్జింగ్సుకీ, కుదరనివారాల్లో కాస్త మూతి తుడుచుకోడానికీ, శాస్త్రిగారి యింట్లోనే యేర్పాటుచేశారు. శాస్త్రికి మల్లే వూళ్ళో వో అంగుళం భూమికూడాలేని బంధువులూ, ముహం యెరిగినవారూ, సంచార్యం తిరుగుతూ, యెంతైనా టౌను కాబట్టీ, శుభాశుభాలు తరుచుగా జరుగుతుంటాయి కాబట్టీ మెల్లిగావచ్చి శాస్త్రిగారియిల్లు చేరుకున్నారు. వీరందరికీ శాస్త్రికి నెలజీతం

యాశయిరూపాయలేననీ. యింతమంది బైతాయిస్తే జరగడం కష్టతరమనీ, తెలుసు. పైగా వీరిలో వొహర్నయినా శాస్త్రి 'నోటిపళ్ళ'బెట్టి రమ్మని ఆహ్వానించిన పాపానపోలా! అయినప్పటికీ తాము అన్యధావెళ్ళితే శాస్త్రి మనస్సు నొచ్చుకుంటాడనేసంగతి బాగా యెరిగినవాళ్ళు కాబట్టి మరోవిధంగా నడుచుకోడానికి సాహసించలాకపొయ్యారు.

యీ పరిస్థితుల్ని చూచి శాస్త్రి కంగారైపొయ్యాడు మొదట్లోనే. కాని, నోరుమెతకవాడు అవడంవల్లనూ, అయినా యింకా ఆగిచూద్దామనే ఓర్పుకలవాడు అవడంవల్లనూ, పూటకి పంక్తిలో సరాసరి పది—పదహారుమంది భోజనానికి తయారౌతున్నా, చూస్తూ వూరికే వుండిపొయ్యాడు కొన్ని నెల్లవరకూ. 'అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి' మనసులో తుపాన్లుకొడుతున్నా, వొండి వేస్తూవొచ్చింది కొంతకాలంవరకూ. కాని తర్వాత యేమాత్రం ఆగలేక "యేమిటి యీపాడు పోడు? ఈ నౌకరీలేకుంటే పీడన్నాగాపోయింది. నేను చెయ్యలేను. కొన్నాళ్ళు మాపుట్టింటికన్నా పంపండి." అనేసింది యేకాంతంగా కన్నీరు విడుస్తూ.

యింతవరకూ మౌనముద్రలోవుండి తనవేపూ, తనభార్యవేపూ వచ్చివుంటుండే చుట్టాల విషయంలో యేమిచెయ్యాల్నాని మార్గాన్వేషణం చేస్తున్న శాస్త్రి, యీమాట వింటూనే కార్యక్రమంలోకి దిగాడు. ఆమర్నాడే భార్యనీ, పిల్లల్నీ ప్రయాణంచేసి సాగనంపి, తానుమాత్రం స్వయంపాకంచేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కాని దీనివల్ల యెక్కువ ఫలితం కలగలా! బింకంగా వుండే వొకటి రెండు జీవాలు వూడినా, సైన్యమంతా అలానేవుండిపోయింది. పంక్తిలో బ్రాహ్మణుడు లేకుండా శాస్త్రి పెద్దల్లో యెవరూ 'అమృతమస్తు' అన్నవారుకారు అలాంటప్పుడు. అలాంటి పాపానికి శాస్త్రిని వొదిలివెళ్ళడం వాళ్ళకి యేమాత్రమూ న్యాయంగా తోచలా, విధిలేక శాస్త్రి చేసుకున్నపథ్యం మెదుకుల్నే తాముగూడా స్వీకరించి, శాస్త్రిని ధన్యుణ్ణిగా చెయ్య సాగారు.

శాస్త్రి తలతిరిగిపోయింది. వొకనాడు సాయంకాలం వూరంతా తిరిగివచ్చి భోజనసమయంలో పక్కన - యెనిమిదిమైళ్ళదూరంలోవుండే వో గ్రామంలో వో బంగారు పిచ్చుక గతించిందనీ, రేపే దశాహమనీ, వుదారంగా సంభావనా, సమారాధనా జరుగుతుందనీ చెప్పాడు.

మర్నాడు తెల్లవారి యెనిమిది గంటలయ్యాక అందరూ సర్వస్వతంత్రంగా వ్యవహరిస్తూ వుండేవారే కాబట్టి, కాతా అంగట్లో రెండు శేర్లు సొజ్జా వగైరా తెచ్చి, పదిగంటలయ్యేసరికి వుప్మా—కాఫీలు ముగించుకొని అందరూ ప్రయాణం చేశారు. శాస్త్రికి తల కడుక్కున్న విధంగా తోచింది. కాని యెంత కాలమో గడవలా. రాత్రి తొమ్మిది గంటలయ్యేసరికి తిరిగి అందరూ హాజరయ్యారు. భోజనాలకి అకాలమైనా, వస్తుపడివుండడం గృహస్తుకు అరిష్టదాయకం కాబట్టి వారిలోనే వొకభీముడు కుంభం పొంగించగా, అందరూ వుదరాబదరాతిని శయనించారు. యీ వుపాయం మామూలుకంటె నష్టదాయకమని గ్రహించాడు శాస్త్రి. 'ముందు గతేమిటా' అనే డైలమాలో పడిపోయింది అతని మనస్సు. మొదట్నుంచీ ఖర్చువెచ్చాలు చూచుకుంటే యీ స్వల్ప కాలంలోనే అంగట్లో రెండు వందలవరకూ బాకీ తేలింది. వొకరోజు రాత్రంతా నిద్రపట్టలా శాస్త్రికి. "యిదేమి భార్యకూ, పిల్లలకూ దూరమై యిలా పరులకోసం రుణాల పాలు కావడం? యిల్లు యీగతిగా వుంటే యీ బాకీలు తీర్చడం యేనాటికి?" అనే ప్రశ్నలు లెక్కలేనన్నిసార్లు జపించాడు. చివరకి చివరి వుపాయంగా అంగడి అక్కవుంటు బందుచేసి హోటల్లో చేరాడు. యింట్లో వుండే అతిథులతో యిలా "హోటల్లో చేరా" అని మాత్రం అన్నాడు. ఆపూట లక్షణంగా భోంచేసి విద్యాశాలకి వెళ్లాడు. యింట్లో మిగిలివున్న పదార్థాలు అతిథుల కందరికీ ఆనాటికి సరిపొయ్యాయి. "వీళ్ళ పని యీనాటితోసరి" అనుకుంటూ పొంగి పొయ్యాడు శాస్త్రి. కాని తానొకటి తలిస్తే దైవం మరొకటి తలిచాడు!

మర్రోజు హోటల్లో భోజనానికి కూచున్నాడు శాస్త్రి. వున్నట్టుండి అతిథులుకూడా బిలబిల్లాడుతూ వొచ్చి ఆయనపంక్తిలో ఆసీనులయ్యారు అందరూ శాస్త్రిగారి అతిథులమన్నట్లుగా తలలు యెగరేశారు. శాస్త్రికి గుండెల్లో పెద్ద పిడుగు పడిపోయింది. ఆపూట అన్నమే సయించలా. అందరూ వెళ్ళాక శాస్త్రి హోటల్ అయ్యరుతో తన కష్టసుఖాల్ని చెప్పుకున్నాడు. యెలాగైనా వీళ్ళబాధ తప్పించమని వేడుకున్నాడు. అయ్యరు మనసు కరిగిపోయింది. అనుభవశాలి కాబట్టి తామూలుగా ఆలోచించి "యిట్లాదా చెయ్యటం—వుభయోగంలేదు. మీకుదా నోరుగట్టిలేదు. మేందా యేమి చేస్తుం? మీకుదా ఒరుధా వుభాయం వుంది. దూరం దా బదిలీ చేయించుకోండి. అది వొహడే దా మార్గం" అని సలహా చెప్పాడు.

శాస్త్రికి మతిపోయినట్లయింది. జ్వరం వొచ్చేసింది. ఆరోజంతా శెలవుపెట్టి వూరిబయటి తోట్లో యేకాంతంగా చింతించాడు. ఆలోచించాడు. "మునిసిపాలిటీ నౌకరికి బదిలీ యేమిటి?—వొహటే బదిలీ" అని తిక్కగా నవ్వుకున్నాడు. చివరకి 'యీ చీరపేలు యేరేశే దానికంటె బొంత తగలెయ్యడమే శ్రేయమనీ, తర్వాతికథ 'వుపనయనము నాటి మాట వుండనే వున్నదనీ' నిశ్చయించుకున్నాడు.

మరునర్రోజు వుదయాన్నే యింటివానికీ, అంగడి మనిషికీ నచ్చచెప్పి, యిల్లు ఖాలీ చేశాడు. అతిథుల వేపు కన్నెత్తయినా చూళ్ళా. వో పావుటావు కాగితంతో యీ నౌకరీ జంజాటమంతా వొదిలించుకొని, స్వగ్రామానికి వో రెండెద్దుల బండి యేర్పాటు చేసుకున్నాడు. సామానుకీ తనకీ.

రాజీనామాల్లో అనేకవిధాలున్నాయి. కాని యీరకం రాజీనామాకు యిదొక్కటే వుదాహరణమని తోస్తూంది.

